www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 8 మే 2023 5 తూర్పుగోదావరి



ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘం ఆవరణలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్, చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొనానరు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సింగంపల్లి కార్తిక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడారు. జాతీయ గీతం రచించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ బోర్డ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, హితకారిణీ ట్రస్ట్ డైరెక్టర్ సరిత రాణి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

ఆర్‌బికెలను పరిశీలించిన జిల్లా ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి - రాజానగరం, కొవ్వూరు రూరల్

వర్షానికి తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని నిర్దేశించిన మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్లు జిల్లా ప్రత్యేకాధికారి, సిఆర్‌కె కమిషనర్ వివేక్ యాదవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, రాజానగరం మండలాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. కొవ్వూరు మండలం దొమ్మేరు, రాజానగరం మండలం కొత్త తుంగపాడు ఆర్‌బికెలను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, జెసి తేజ్‌భరత్, వ్యవసాయాధికారులతో కలసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆర్‌బికె కేంద్రంలో ఏర్పాటు చేసిన తేమ శాతాన్ని నిర్ధారించే యంత్ర పరికరం పనితీరును ప్రత్యేక అధికారికి కలెక్టర్‌కు తెలియజేశారు. తేమ శాతం విషయంలో రైతులకు భరోసా కల్పిస్తూ కొనుగోలు చేపడుతున్నామన్నారు. రానున్న రెండు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన కోతలు పూర్తయిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి వివేక్‌యాదవ్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసే సమయంలో దళారుల ప్రమేయం లేకుండా రైతులకు పూర్తి మద్దతు ధర అదించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఆ మేరకు క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు పర్యటిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో వర్షం సమయంలో పంట పొలాల్లో నీరు నిలిచిపోకుండా బయటకు వెళ్లేలా కాలువ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచనలు ఇచ్చామన్నారు. దొమ్మేరులో రహదారి వెంబడి ధాన్యం ఆరబెట్టిన రైతులతో మాట్లాడారు. గన్ని బ్యాగులు సరఫరా, విరిగిన ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్ల నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు ప్రత్యేక అధికారి దష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జెసి తేజ్ భరత్ మాట్లాడుతూ, రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ఆఫ్ లైన్ ద్వారా కూడా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, ఎ.చైత్ర వర్షిణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డిస్‌ఒ పి.ప్రసాదరావు, సివిల్ సప్లయిస్ డిఎంవి. నాగార్జునరెడ్డి, ఇతర అధికారులు, రైతులు ఉన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి



డిఎల్‌ఎస్‌ఎ సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

రాజ్యాంగానికి లోబడే వ్యవస్థలు

హైకోర్టు జడ్జి ఆకుల వెంకటశేషసాయి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రతి ఒక్కరికీ 'రైట్ టూ లైఫ్' కల్పించడం కోసం దేశంలో వ్యవస్థలు సక్రమంగా పని చేయడానికి అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగమే కారణమనిఎపి రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు జడ్జి ఆకుల వెంకటశేషసాయి అన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్‌కు రుణపడి ఉండాలన్నారు. నగరంలో ఆధునికీకరించిన డిఎల్‌ఎస్‌ఎ సమావేశ మందిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయనతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ టి.మల్లి కార్జునరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి వెంకటశేషసాయి మాట్లాడారు. అందరికీ న్యాయం జరిగినప్పుడే దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ,గూడు అందుతాయన్నారు. ఆర్థిక, సామాజిక హోదా ఆధారంగా కాకుండా, వారి హక్కుగా న్యాయం జరగాలన్నారు. ఏ భారతీయుడు ఆర్థిక, సామాజిక స్థితి కారణంగా అన్యాయానికి గురి కాకూడదు అని రాజ్యాంగం ఆర్టికల్ 39(ఎ)లో అంబేద్కర్ పొందుపర్చారన్నారు. జాతీయ లోక్ అదాలత్, న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు ద్వారా సత్వర న్యాయం సాధ్యం అవుతుందన్నారు. జిల్లా స్థాయిలో న్యాయం కోసం వచ్చే వారికి డిఎల్‌ఎస్‌ఎ ద్వారా అందిస్తున్న సేవల పట్ల డిఎల్‌ఎస్‌ఎ చైర్మన్ సునీత గంధం, కార్యదర్శి కె.ప్రత్యూష కుమారిలను అభినందించారు. అనంతరం హైకోర్టు జడ్జి జస్టిస్ సిహెచ్. మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల పరిధిలో సత్వర న్యాయం సాధ్యం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మరో హైకోర్టు జడ్జి జస్టిస్ టి. మల్లికార్జునరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటైందన్నారు. ఈ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత గంధం మాట్లాడుతూ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సత్వర న్యాయం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. న్యాయ వ్యవస్థ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో తల్లి తండ్రులను కోల్పోయిన 9 మంది పిల్లలకు జిల్లా యంత్రాంగం ద్వారా గుర్తించి వారికి రూ.10 లక్షల చొప్పున రూ.90 లక్షలు అందజేస్తున్నామన్నారు. తొలుత జిల్లా కోర్టు ప్రాంగణానికి చేరుకున్న హైకోర్టు న్యాయ మూర్తులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, తదితరులు ఆహ్వానం పలికారు. అనంతరం పోలీసులు గార్డ్ ఆఫ్ హానర్ ఇచారు. న్యాయ మూర్తులు కోర్టు అవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌ఎస్‌ఎ సెక్రటరీ కె.ప్రత్యూషకుమారి, న్యాయ మూర్తులు ఎం.నాగేశ్వరరావు, పిఆర్.రాజీవ్, యుయు.ప్రసాద్, ఎ.గాయత్రిదేవి, ఎస్‌పి సిహెచ్.సుధీర్‌కుమార్, జెసి ఎన్.తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు జియువిబి.రాజు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసి ప్రయవేటీకరణను అడ్డుకోవాలి

ఎల్‌ఐసి జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న ఎల్‌ఐసిని ప్రయివేటు పరం చేసే దిశగా సాగుతున్న చర్యలను అడ్డుకోవాలని ఎల్‌ఐసి ఏజెన్సీ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి పిఎల్.నరసింహారావు అన్నారు. ఆదివారం మండలంలోని పాలంగిలో నిర్వహించిన ఎల్‌ఐసి ఎఒఐ రాజమండ్రి డివిజన్ ఈసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 22, 23 తేదీల్లో జరగనున్న ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా 6వ అఖిలభారత మహాసభను విజయవంతం కోసం ఈ సమావేశం నిర్వహించామన్నారు. ప్రస్తుతం ఎల్‌ఐసి ఎదుర్కొంటున్న ఐపిఒ, బీమా సుగం ఐఆర్‌డిఎ డ్రాఫ్ట్ లకు వ్యతిరేకంగా ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం విధానాల వల్ల ఏజెంట్లు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే చర్యలను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. లేని పక్షంలో 11 లక్షల మంది ఏజెంట్లు, వారి కుటుంబాలు రోడ్డున పడే ఆస్కారం ఉందన్నారు. ఈ సమస్యలపై మహాసభలో చర్చించి కార్యాచరణ చేపడతారన్నారు. ప్రతి ఒక్కరూ మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని తీర్మానించారు. ఈ సమావేశానికి రాజమండ్రి డివిజన్ అధ్యక్షులు వై.విశ్వేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు టి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్, డివిజన్ కార్యదర్శి కె.నాగిరెడ్డి, ట్రెజరర్ రాచూరి రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.జాన్‌బాబు, తణుకు శాఖ ఏజెంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సత్తి పాండురంగారెడ్డి, ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షులు సలాది ఉదయభాస్కరరావు, ట్రెజరర్ రామప్రసాద్, బొలిశెట్టి రామనాథ్, చెక్క గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతుల్లో మళ్లీ అలజడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో మళ్లీ చినుకులు పడటంతో రైతుల్లో అలజడి నెలకొంది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో రైతులకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. మామిడి తోటలు గాలి దుమ్ములకు కాయలు రాలిపోయి నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇటుక బట్టీల్లో వేలాది ఇటుకలు తయారు చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికతో వాతావరణం మారడంతో హుటాహుటిన భారీ టార్పలిన్లతో కప్పి వాటిని కాపాడుకునే ప్రయత్నంలో యజమానులు ఉన్నారు. ఈదురుగాలులుకు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ అకాల వర్షాలకు ఇప్పటికే రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అది మరువక ముందే మళ్లీ వర్షాలు పడటంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు. ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలీక తలలు పట్టుకుంటున్నారు.

టిడిపి అధికారంలోకొస్తే రైతులకు న్యాయం

ప్రజాశక్తి -అనపర్తి

టిడిపి అధికారంలోకొస్తే రైతులకు సంపూర్ణ న్యాయం చేస్తామని మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. అనపర్తి మండలం చినపొలమూరు, అనపర్తి, సావారం గ్రామాల్లో టిడిపి నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. వర్షాలకు తడిసి, రంగుమారిన, మొలకలు వచ్చిన ధాన్యం రాశులను పరిశీలించారు.

సమస్యలపై దశలవారీ పోరాటం

104 ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటానికి సిద్ధమవ్వాలని 104 ఉద్యోగులు సిద్ధమవ్వాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం 104 ఉద్యోగుల జిల్లా కమిటీ సమావేశం పేపర్ మిల్లు వద్ద గల బిటిఆర్ భవన్ లో జిల్లా అధ్యక్షులు అలపాటి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.రాజులోవ, జిల్లా కార్యదర్శి మూల సింహాద్రినాయుడు మాట్లాడారు. 104 ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, వేతనాలు లేక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు 104 ఉద్యోగులను ఆప్కాస్‌లో చేరుస్తామని జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జగన్ అధికారంలోకొచ్చిన నాలుగేళ్లు పూర్తవుతున్న నేటికీ ఆప్కాస్‌లో చేర్చలేదన్నారు. వెంటనే 104 ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని, తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 8 నుంచి 20 వరకు దశలవారీగా అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు జిల్లాలో మీ స్థాయిలో అధికారులకు ప్రజాప్రతి నిధులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొర్రెల కాంతారావు, జిల్లా కమిటీ సభ్యులు టివిఎస్.మల్లికార్జున్, రాంబాబు, కాంతా రావు, శివబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు



పరిశోధనా శాస్త్రవేత్తల బృందంతో నర్సరీ యాజమాన్యం

సత్యదేవా నర్సరీని సందర్శించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కడియం

ఐసిఎఆర్ పరిధిలోని జాతీయ వ్యవసాయ పరిశోధనా అకాడమీ నుంచి 24 రాష్ట్రాలకు చెందిన 117 మంది వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు ఆదివారం సత్యదేవా నర్సరీని సందర్శించారు. నర్సరీ యాజమాన్యం పుల్లా ఆంజనేయులు, పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్ వారికి స్వాగతం పలికారు. నర్సరీలోని పలురకాల మామిడి, కొబ్బరి మొక్కల గురించి వివరించారు. అలాగే పలురకాల మొక్కల తయారీ, పెంపకం, గ్రాఫ్టింగ్, వివిధ రకాల సేంద్రియ ఎరువుల ద్వారా మట్టి తయారీ తదితర అంశాలను శాస్త్రవేత్తలకు వివరించారు. ఈ సందర్భంగా పరిశోధనా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కడియం నర్సరీలు పరిశోధనలకు ప్రయోగశాలలుగా ఉన్నాయన్నారు. ఇక్కడి రైతుల ఆదరాభిమానాలు, మర్యాదలు, ఆతిథ్యం మరపురానివన్నారు.

పదిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అనపర్తి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అనపర్తికి చెందిన శ్రీ రామారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని హెచ్‌ఎం సత్తిరెడ్డి తెలిపారు. 583 మార్కులతో ఎవిఎస్ఎస్.శ్రీఖర్ అనపర్తి మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడని తెలిపారు. మరో పదిమంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల హవా

ప్రజాశక్తి - అనపర్తి

అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపల్ నాగబాబు తెలిపారు. 71 మంది విద్యార్థులు హాజరు కాగా 50 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించినట్లు అయన తెలిపారు. అభిషేక్ కుమార్ 536, ధనుష్ కుమార్ 483, కె.అజయ్ 454 మార్కులు సాధించారని తెలిపారు. వారిని ప్రిన్సిపల్ నాగబాబుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కళ్లజోడు అవసరంలేని శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - అనపర్తి

క్యాటరాట్ కంటి శస్త్ర చికిత్స చేసినప్పటికీ కళ్లజోడు అవసరమని, నూతన పద్ధతుల ద్వారా రేనర్ ఇఎంవి లెన్స్ అమర్చడం వల్ల కళ్లజోడు అవసరం తగ్గుతుందని నేత్ర వైద్యులు వెంకటరామిరెడ్డి, సంధ్యారెడ్డి సూచించారు. అనపర్తి కంటి ఆసుపత్రిలో అధునాతన లెన్స్ ఏర్పాటు తొలి ప్రయత్నంలోనే విజయ వంతం అయిందని తెలిపారు. తొలి సారిగా అనపర్తిలో ఈ శస్త్ర చికిత్స నిర్వహించిన నేత్ర వైద్యులు వెంకట రామిరెడ్డి, సంధ్యారెడ్డి దంపతులను రాష్ట్ర నేత్ర వైద్యుల సంఘం అధ్యక్షులు తేతలి సత్యనారాయణ రెడ్డి, ఎంఎల్ఎ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఐఎంఎ అధ్యక్ష కార్యదర్శులు రామగుర్రెడ్డి, నవీన్ అభినందించారు.

వేసవి శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కడియం


కడియం శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణా శిబిరం కరపత్రం, పోస్టర్‌ను ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తరగతులను విద్యార్థులు ఉపయోగించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడియం గ్రంథాలయ అధికారి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల, విద్యార్థుల తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరంలో రూ.2.75 కోట్లు, చినకొండేపూడిలో రూ.2.66 కోట్లతో నిర్మించనున్న సబ్‌స్టేషన్ల పనులకు ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో లోవోల్టేజ్ సమస్యల పరిష్కారానికి సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. కాటవరంలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం వల్ల కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి తదితర ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. చినకొండేపూడి సబ్ స్టేషన్ నిర్మాణం వలన రఘుదేవపురం, సీతానగరం, రాపాక, చీపురుపల్లి, అచ్యుయ్య పాలెం గ్రామాలకు సక్రమంగా విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. అనంతరం రాజంపేటలో అక్కిన ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ఆయన ప్రారంభించారు. అక్కిన ముని కోటేశ్వరరావు, స్థల దాతలు కవల కృష్ణమూర్తి, కవల సురేష్‌లను అభినందించారు. అనంతరం చిన కొండేపూడిలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఘుదేవపురంలో పేరంటాలమ్మ సంబరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన 22 మంది మహిళలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. వంగలపూడిలో పునర్నిర్మిస్తున్న రామాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రామచంద్రపురం గ్రామంలో పురుషోత్తం పట్నం ఎత్తిపోతల పథకం బాధిత రైతులతో సమావేశమయ్యారు. ఎకరాకు రూ.28 లక్షలు చొప్పున రైతులు అంగీకరిస్తే ప్రభుత్వం పరిహారం అందించడానికి సుముఖంగా ఉందన్నారు. సీతానగరం మండలానికి చెందిన చెరుకూరి వెంకటలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన 50 వేల రూపాయల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, జడ్‌పిటిసి సభ్యులు సిహెచ్.వెంకటలక్ష్మి, మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో-కన్వీనర్ కె.హరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బాబు, సుజీరాజు, గద్దె వెంకటకృష్ణచౌదరి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఇదేం వింత అల్టిమేటం బాబూ...

వైసిపి జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మూడు రోజులుగా రైతుల పరామర్శ పేరుతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పర్యటించిన టిడిపి అధినేత చంద్రబాబు 72 గంటల్లో ధాన్యం కొనుగోళ్లు చేయాలని అల్టిమేటం ఇవ్వడం హాస్యాస్పదమని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 16 నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు నిరంతరాయంగా సాగుతుంటే ఇప్పుడు కొత్తగా 72 గంటల గడువుతో అల్టిమేటం ఇవ్వడం ఆయన రాజకీయ దురుద్దేశాన్ని బహిర్గతం చేస్తోందన్నారు. అసలు చంద్రబాబు గోదావరి జిల్లాల పర్యటన పరమార్థం చిట్ ఫండ్ వ్యవహారాల్లో నిబంధనలు ఉల్లంఘించి, సిఐడి కేసులో ఇరుక్కుని, సెంట్రల్ జైలు పాలైన టిడిపి నేతలను పరామర్శించుకోవడానికేనని స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన వెంటనే 9వ తేదీ నుంచి పంటల నష్టాలను లెక్కించడానికి అధికారులు సిద్ధంగా ఉంటే, వర్షాలు కురుస్తుండగానే సాయం అందించలేదని చంద్రబాబు విమర్శించడం రాజకీయ దివాళాకోరుతనాన్ని తెలియజేస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుండి పంటలను కాపాడటానికి మొదటి పంట ఖరీఫ్‌ను ముందుగానే ప్రారంభించేలా ముఖ్యమంత్రి ప్రణాళిక రూపొందించి అమలు చేశారన్నారు. జూన్ ఒకటికే ఖరీఫ్ పంటకు నీరివ్వడం ఇందులో భాగమేనన్నారు. ఇంత దూరదష్టితో పనిచేసినా, అకాల వర్షాలు ప్రస్తుత రబీ సీజనులో నష్టాలను కలిగించాయన్నారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే సీనియర్ ఐఎఎస్ అధికారులను క్షేత్రస్థాయి పర్యటనలకు పంపించి, ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారన్నారు. రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం సైతం కొనుగోలుచేసేలా పలు సడలింపులు సైతం ప్రకటించారన్నారు. దళారీలకు చెక్‌పెట్టి ఆన్‌లైన్ ద్వారా కొనుగోళ్లు నిర్వహిస్తున్నామన్నారు. చంద్రబాబు హయాంలో ఎప్పుడైనా రంగు మారిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యం కొనుగోలుచేశారా అని రాజా సూటిగా ప్రశ్నించారు. జిల్లాలో 6వ తేదీ నాటికి 1,18,466 టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. రూ.64.33 కోట్లు చెల్లించారన్నారు. మరో రూ.115 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. చంద్రబాబు ప్రవర్తన, ఆలోచన తీరు మార్చుకోకపోతే ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

160 మంది వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం రఘదేవపురానికి చెందిన టిడిపి నాయకులు కాండ్రు వెంకటరాజు సమక్షంలో 60 మంది టిడిపి, జనసేన కార్యకర్తలు, ముగ్గళ్లలో పినిపే సందీప్‌కుమార్‌తో పాటు మరో 100 మంది ఆదివారం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. కండువాలు కప్పి వారిని ఎంఎల్ఎ రాజా వైసిపిలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్ద ఎత్తున వైసిపిలో చేరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నర ఏళ్ళలోనే మేనిఫెస్టోలో ఇచ్చిన 98శాతం హామీలను నెరవేర్చిందన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముందుకే పాలనను తీసుకెళ్లిందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా శ్రీను, నాయకులు కరుటూరి హరిబాబు, నియోజకవర్గ బూత్ కమిటీ చైర్మన్ గద్దె వెంకటకృష్ణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని వికె.రాయపురంలో ఆదివారం ఒక వ్యక్తి నుంచి పందేల్లో కోళ్లకు వినియోగించే 42 కోడి కత్తులను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు. మల్లిరెడ్డి సూరిబాబు దగ్గర నుంచి కోడిపందేలకు ఉపయోగించే సుమారు 42 కోడి కత్తులను సీజ్ చేసి అతని మీద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చెరువులో పడి మహిళ మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మహిళ మతి చెందిన సంఘటన ఇది. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా అరకు మండలం బొండం గ్రామానికి చెందిన బీరవర్త శుక్ర తన భార్య జానకి(48)తో వలస వచ్చి ఎన్.కొత్తపల్లిలో భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంకు చెందిన రైతు చీకట్ల దుర్గాప్రసాద్ రొయ్యల చెరువుల వద్ద మూడేళ్లుగా పని చేస్తున్నాడు. యజమాని దుర్గాప్రసాద్ చెరువుల వద్ద ఆవు కనిపించకపోవడంతో శనివారం రాత్రి సమయంలో జానకి ఆవును వెతుక్కుంటూ వెళ్ళింది. ప్రమాదవశాత్తు పక్క రైతు బొడ్డు వీర వెంకట సత్యనారాయణ రొయ్యల చెరువులో జారిపడి మతి చెందినట్లు భర్త శుక్ర తమకు ఆదివారం ఫిర్యాదు చేశాడన్నారు. జానకికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి-జగ్గంపేట

జగ్గంపేట మండల పరిధిలోని పలుచోట్ల పేకాట శిబిరాలపై దాడి చేసి పలువురినీ అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ సూర్య అప్పారావు తెలిపారు. కాండ్రేగుల సమీపంలో జీడి మామిడి తోటలో రహస్యంగా పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.12,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మామిడాడలో మరో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని సోమవారం కోర్టుకు పంపుతామన్నారు. వీరి వద్ద నుంచి రూ.2,000 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడిగేదె

విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాడిగేదె విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. ధవళేశ్వరంలోని స్థానిక సదరన్ డ్రగ్స్ వెనుకన ఉన్న పొలంలో గడ్డి మేసేందుకు వెళ్లిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురైంది. చిన్నకర్రలు కట్టి విద్యుత్ వైర్లను లాగారు. వీటికి తగలడంతో గేదె మృత్యువాత పడింది. గతంలో కూడా ఇదే విధంగా ధవలేశ్వరంలోని బ్యారేజీ క్వార్టర్స్‌లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృత్యువాత పడింది. ఇప్పుడు మరో గేదె ఇలాగే మృతి చెందడంతో యజమానికి వాపోతున్నాడు. పాడిగేదెలతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, రెండు గేదెలు చనిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయాడు.

రౌతులపూడికి పోలీస్ స్టేషన్ మంజూరు

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడికి తొందర్లోనే పోలీస్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రమైన రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ కోసం ప్రభుత్వ భవనాలను ఆదివారం ఆయన పరిశీలించారు. మండలానికి పోలీస్ స్టేషన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల జిఒ జారీ చేసినట్టు తెలిపారు. ఆయన వెంట ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు ఉన్నారు.



ఠాగూర్‌కు నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిరస్మరణీయుడు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

దేశానికి జనగణమన జాతీయ గీతాన్ని అందించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిరస్మరణీయులని ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఠాగూర్ బాలల హదయాలను వికసింపజేయడానికి ప్రాచీన మునుల గురుకులాల తరహాలో శాంతి నికేతన్‌గా పేరుగాంచిన విశ్వ భారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, ఉంగరాల వెంకటేశ్వరరావు, రాజా, ఎస్. శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యార్థులకు ఆటపాటలు

గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్



ముఖాముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వేసవి సెలవుల్లో ఆటలు, పాటలు, విజ్ఞానాన్ని పంచేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి గ్రంథాలయాలు సిద్ధమవుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి విఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్ అన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని అన్ని శాఖల్లో ఈ నెల 8 నుంచి కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల లోపు బాల బాలికలంతా వీటిని సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను ఆయన వివరించారు.

శిక్షణా శిబిరాలకు ఏయే ఏర్పాట్లు చేస్తున్నారు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 102 ప్రభుత్వ గ్రయావలయాలు ఉన్నాయి. వీటిలో 57 లైబ్రరీలకు సొంత భవనాలుండగా, 14 అద్దె భవనాల్లో, 31 ఉచితంగా ఏర్పాటు చేసిన భవనాల్లో నడుస్తున్నాయి. వేసవి శిక్షణా శిబిరాలను 85 గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నాం.

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. సమీపంలోని విద్యార్థులను రప్పించి రోజూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తాం. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలు, మానసిక వికాసానికి ఆటపాటలు నిర్వహిస్తాము. ఒక్కో గ్రంథాలయంలో సగటున 50 మంది వరకు వచ్చి వీటిని వినియోగించుకుంటారు. సోమవారం నుంచి మొదలయ్యే శిక్షణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేశాం. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీటిని నిర్వహిస్తారు.

శిక్షణ తరగదులు ఎలా నిర్వహిస్తారు.?

ఉదయం 8 గంటల నుంచి 8:30 వరకు కథలు వినడం, 8:30 గంటల నుంచి 10 గంటల వరకు పుస్తకాలు చదవడం, తర్వాత పది నిమిషాలు విరామం అనంతరం 10:30 వరకు చదివిన అంశాలపై సమీక్ష ఉంటుంది. 10:30 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం ఉంటుంది. 11 గంటల నుంచి 12 గంటల వరకూ స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, డాన్సులు, పేపర్ క్రాఫ్ట్, బొమ్మల తయారీ, నాటికల పోటీలు, ఆటలు, ముఖ్యమైన ప్రతినిధులతో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఉంటాయి.

పిల్లలను ఏ విధంగా ప్రోత్సహిస్తారు..

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే కరపత్రాలు, గోడప్రతులు ఇచ్చి అందరికీ తెలిసేలా ప్రచారం నిర్వహించాం. వేసవి శిక్షణ, ఆట పాటల్లో పాల్గొనే విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు సర్టిఫికెట్లతోపాటు, ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తాం. దీని కోసం గ్రేడ్ 1 గ్రంథాలయాలకు రూ.15 వేలు, గ్రేడ్ 2కు రూ.12 వేలు, గ్రేడ్ 3 కు రూ.10 వేలు చొప్పున కేటాయిస్తున్నాం. ఇవి కాకుండా దాతల సహకారం కూడా తీసుకుంటున్నాం.

ఏయే అంశాలపై శిక్షణ ఉంటుంది..

పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. కథలు వినడం, చెప్పడం, గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం, వాటిపై సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్ ఆర్ట్, సంగీతం, నత్యం, చదరంగం, క్యారమ్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తాం. జరిగిన కార్యక్రమాలపై ప్రతి వారం సమీక్ష, చర్చ నిర్వహిస్తారు. మొత్తంగా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా ఉంటాయి.

యానాం వార్తలు

ప్రభుత్వాసుపత్రిలో పని చేయని ఎక్స్‌రే

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఎక్స్ రే యంత్రం పని చేయక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న యానాం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అర్ధాని దినేష్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఎక్స్ రే మిషన్ పని చేయక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కానీ స్థానిక నాయకులు కానీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ప్రభుత్వ ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్‌ను వివరణ కోరగా ఉన్నత అధికారులకు తెలియజేశామని త్వరలో సమస్య పరిష్కారం చూపుతామన్నారన్నారు. ఈ సమస్యను పుదుచ్చేరి ఎంపీ వైద్య లింగంకు ఫోన్లో తెలపగా ఆయన సానుకూలంగా స్పందించి ఎంపీ నిధులు ఏర్పాటు చేస్తామన్నారన్నారు.



అల్లూరికి నివాళులర్పిస్తున్న పరిపాలనాధికారి, సిబ్బంది

అల్లూరి సీతారామరాజుకు పలువురి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్.మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, సిఐ షణ్ముగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి రామలింగేశ్వరరావు, రామరాజు, సుబ్బరాజు, చెల్లి గోపీనాథ్, చెక్కల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సిలో శ్రీసిద్ధార్థ ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు విశేష ప్రతిభ ఘనపరిచారని శ్రీసిద్ధార్థ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎస్‌కె.విశాలాక్షి శేఖర రాజు, ప్రిన్సిపల్ కె.చక్రపాణి తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. నూరు శాతం ఫలితాలు సాధించగా విద్యార్థి భరత్ 600/547 మార్కులతో టాపర్‌గా నిలిచాడన్నారు. రాజశ్రీ 520, సౌమ్య 495, 400 దాటి తులసి, లిల్లీ గ్రేస్, జయరాజ్, సాయి చరణ్, దినేష్ కుమార్, శాలిం ప్రదీప్, సాయి మణికంత, మేఘన చంద్రకళ, భువనేశ్వరి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల, మంజు, ఉష, జ్యోతి మౌనిక పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

తాళ్లరేవు మండలం చొల్లంగిపేట డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 10లో ఉత్తమ ప్రతిభ సాధించినట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన పి.నిరీష (555 స్కూల్ ప్రథమ) వై.అనూష (530 ద్వితీయ) ఎస్.స్వాతి (528 తృతీయ)లను ఎఎంఒ సంజీవరావు, జిల్లా సమన్వయకర్త ఎ.మురళీకృష్ణ, ఉపాధ్యాయినులు అభినందించారు.



కాకినాడ రూరల్‌లో శ్రీ సిద్ధార్థ విద్యార్థులతో అధ్యాపకులు

వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల తీవ్రంగా పంట నష్టం వచ్చిన రైతులను, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలనీ, నీట మునిగిన పంట రైతు భరోసా కేంద్రాల ద్వారా త్వరతగతిని కొనుగోలు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి డిమాండ్ చేశారు. కరప, వలసపాకల, వేళంగి శివారు కొప్పిశెట్టి వారిపేట, యండమూరు శివారు ఒడ్డుపాలెంలో నీట మునిగిన పంట పొలాలను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి కాలం దష్యా వర్షాలు రావని అనేకమంది రైతులు కాస్త అశ్రద్ధ కారణంగా నేడు భారీ స్థాయిలో పంట నష్టం వచ్చిందని, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు సూచించక పోవటం రైతు భరోసా కేంద్రాలలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవటం వల్ల చిన్న సన్నకారు రైతులకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. బుంగ సింహాద్రి, గుల్లిపల్లి శ్రీనివాస్, కాకర్ల బుజ్జిబాబు, జమిందార్, గంజా రాంబాబు, మద్దూరి స్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని చంద్రంపాలెం దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ పాఠశాలలో నెల రోజులు నిర్వహించే సమ్మర్ జూడో శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నట్టు ఉప్పరగూడెం జెడ్‌పి హైస్కూల్ పీడీ కె.వీరబాబు చెప్పారు. విద్యార్థుల్లో శారీరక ధారుడ్యాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించే సంకల్పంతో నెల రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య, చంద్రంపాలెం, ఉప్పరిగూడెం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచి, గ్రామపెద్దలు హాజరవ్వనున్నట్లు చెప్పారు.

పట్టాల పంపిణీపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం చిన్నస్వామి నగర్‌లో పేదలకు అందించే ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారంలో తమపై టిడిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని వైసిపి నాయకులు అన్నారు. ఆదివారం రూరల్ మండలం చిన్నస్వామి నగర్‌లో కరాటి రాము, ఆకుల సత్తిబాబు, ఎఎంసి డైరెక్టర్ కోరాడ అరుణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2016లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో స్వామి నగర్ ప్రాంతంలో 63 మంది పేదలకు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని చెప్పారు. దాన్ని 93 పట్టాలు చేశారన్నారు. ఈ విషయంపై రూరల్ తహశీసిల్దార్ స్వామి నగర్ వచ్చి పట్టాల విషయాన్ని తనిఖీ చేయగా సామాజిక స్థలం, వాటర్ ట్యాంక్, పార్కు స్థలములను పరిశీలించారన్నారు. ఆ స్థలాన్ని తాము ఆక్రమించుకొని పట్టాలు సృష్టించామని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

మేడే స్ఫూర్తితో హక్కుల పరిరక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

మేడే స్ఫూర్తితో హక్కుల పరిరక్షించుకోవాలని పలువురు నాయకులు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వారోత్సవం లో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ రాగంపేట వడ్డి పోలమాంబ గుడి సెంటర్ లో శనివారం బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్ మాట్లాడుతూ 137వ మే దినోత్సవాన్ని కార్మిక వర్గం జరుపుకుంటోందన్నారు. ప్రత్యేకంగా మనదేశంలో మే దినోత్సవం 1923 ప్రారంభమై నేటికి వందేళ్ళు పూర్తయిందన్నారు. కేంద్రం ప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా ఎనిమిది గంటల పని విధానాన్ని మార్పు చేసి 12 గంటలు పని విధానం తీసుకురావాలని చూస్తోందన్నారు. కార్మిక వర్గంతో పాటు ప్రజలపై కూడా నిత్యం విపరీతమైన భారాలు వేస్తూ నిత్యావసర వస్తువుల ధరలను రోజురోజుకు పెంచుకుంటూ పోతోందన్నారు. దీనివల్ల సామాన్య జనం ఆర్థిక ఇబ్బందులు తో కుటుంబాలు సతమతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర నిర్ణయాలను ఎపి ప్రభుత్వం అమలు చేయడానికి ముందుకు వెళుతోందన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రజలకు కార్మిక వర్గానికి నష్టం కలుగుతున్నా లెక్కచేయకుండా కేంద్ర విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. ఈ మేడే స్ఫూర్తితో కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ అమలు కోసం, కనీస వేతనం రూ.26 వేలు సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, నగర ఉపాధ్యక్షుడు మేడిశెట్టి వెంకట రమణలు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులు కాపాడుకోవాలని, మరింత ఐక్యంగా కార్మిక వర్గం ఉద్యమాలు నిర్వహించాలన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారులు లోవరాజు బందం ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. పెద్దాపురం కళాకారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కష్ణ, గీతాంజలి బందం దేవి ఆలపించిన గీతాలు అలరించాయి. దారపురెడ్డి సత్యనారాయణ, దూలపల్లి అర్జున్‌ల డప్పుల వాయిద్యం మోత మోగించింది. కార్యక్రమంలో జిజిహెచ్ శానిటేషన్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్, నాయకులు వాసు, మంగతాయారు, తలుపులమ్మ, పుష్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బంగారు సత్తిబాబు, నాయకులు జలగడుగుల శ్రీనివాస్, యరంశెట్టి దొరబాబు, భవిరిశెట్టి గురుమూర్తి, యరంశెట్టి నాగబాబు, ఫ్యాబ్రికేషన్ యూనియన్ నాయకులు బివి.రమణ, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎన్ ఈశ్వరి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

జగన్ పాలనలో శెట్టిబలిజలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- తాళ్లరేవు

సిఎం జగన్ పాలనలో శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. ఎఎంసి ఛైర్మన్‌గా ఆయన పదవి పొందిన సందర్భంగా యానం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుంకరపాలెంలోని శంకర్ రెసిడెన్సీలో చీకట్ల సత్యనారాయణ మాస్టారు అధ్యక్షతన జరిగిన శెట్టిబలిజ సంఘ సభ్యులు ఆత్మీయ సమావేశంలో పలువురు శివన్నారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా రాజ్యసభకు కు పిల్లి సుభాష్ చంద్రబోస్ ను పంపిన ఘనత సిఎం జగన్‌దేనని అన్నారు. అదేవిధంగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మరో ఇద్దరు ఎంఎల్‌సిలకు అవకాశం కల్పించిన సిఎం జగన్‌కు శెట్టిబలిజలు రుణపడి ఉండాలని తెలిపారు. అదేవిధంగా మల్లాడి కష్ణారావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పిల్లి త్రిమూర్తులు, చింతాకుల రామకష్ణ, గుత్తుల జయ రామారావు, మట్టపర్తి లోవరాజు, కడలి సుబ్రహ్మణ్యం, చందాల ఏడుకొండలు, కాకి నాగేశ్వరరావు, రామలింగేశ్వర రావు, పంపన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు అందించడమే 'చేయూత' లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆపన్నులకు సేవలు అందించడమే చేయూత సంస్థ లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షులు ఎం.రవికుమార్ తెలిపారు. ఆదివారం చేయూత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా చేయూత ద్వారా సేవలు అందిస్తున్న పలువురిని కాకినాడలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రవి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 300 మంది రోగులకు నిత్యం భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. రక్తదాన శిబిరాలు, ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపన్నులకు అండగా ఉండడం సంతోషకరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఈ సేవలను మరింత విస్తతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి, సహాయ అధ్యక్షులు భాష, సలహాదారుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో చేయూత సంస్థ అధ్యక్షులు రవి తదితరులు

పోలేరమ్మను దర్శించుకున్న చందన, కందుల

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామ దేవత పోలేరమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆదివారం వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కందుల దుర్గేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది. అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు ఉండాలని చందన, కందుల ఆకాంక్షించారు. దర్శించుకున్న వారిలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి గిరజాలబాబు, వ్యవసాయ మండలి ఛైర్మన్ ఈలి గోపాలం, ముద్రగడ జమ్మీ, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, తాతపూడి బాబి తదితరులు ఉన్నారు.

అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - సీతానగరం

అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా సీతానగరం నాలుగు బొమ్మలు సెంటర్ ఉన్న విగ్రహం వద్ద సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజనగరం నియోజవర్గం ప్రెసిడెంట్ సిద్ది నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నందమూరి చిట్టి స్వామి, వడ్లమూరి సీతారామరాజు, వేటూరి నానాజీ, కోసూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

తాటిపర్తి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి రంగా విశేషంగా కషి చేశారన్నారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల రామస్వామి, యువత పాల్గొన్నారు.

జేగురుపాడులో బైబిల్ మిషన్ పుట్టింటి సభలు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడులో రెండు రోజులుగా బైబిల్ మిషన్ పుట్టింటి సభలు జరుగుతున్నాయి. బైబిల్ మిషన్ వ్యవస్థాపకులు ముంగమూరి దేవదాసు అయ్య జన్మించిన జేగురుపాడులో పాస్టర్ సాకా మహిమరాజు ఆధ్వర్యంలో ఈ సభలను నిర్వహిస్తున్నారు. ఈ సభలో ఆదివారం సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సభ నిర్వాహకులు ఎస్.మహిమరాజు, సభ అధ్యక్షులు ఎస్.ఏసుపాదం, పాస్టర్ ఫెలోషిప్ వారు సంయుక్తంగా సర్పంచ్ స్టాలిన్‌ను సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో కరుణాకరణ్, పరంజ్యోతి, జయశీలి, మోజెస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో శిథిలావస్థకు చేరుకున్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి పురాతన ఆలయం పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు నడుంబిగించారు. మాజీ సర్పంచ్ మట్టా సత్యనారాయణ దీని కోసం రూ.23.50 లక్షలు విరాళం ప్రకటించారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.వెంకట్రావు ఆదివారం తెలిపారు. గ్రామంలోని భక్తులు, దాతల సహకారంతో సుమారు రూ.1.50 కోట్లతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. మ్యాచింగ్ సొమ్ముతో కలిపి, దేవదాయ ధర్మదాయ శాఖ సుమారు రూ.80 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఇఒ తెలిపారు. ఈ మేరకు మంజూరు పత్రాన్ని కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మంత్రి అనుచిత వ్యాఖ్యలకు మద్దిపాటి ఖండన

ప్రజాశక్తి-నల్లజర్ల

వెల్పూరులో రైతు తడిసిన ధాన్యాన్ని కొనేవారు లేరని మంత్రి వద్ద వాపోతుండగా అతనిపట్ల మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు ఖండించారు. ఆదివారం తిమ్మన్నపాలెం, చీపురుగూడెం గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.34 వేల కోట్ల దళితుల సబ్ ప్లాన్ నిధులను సిఎం జగన్ పక్కదారి పట్టించారన్నారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటి? అని ప్రశ్నించారు. ఒక దళితుడిగా తాను దళితుల సంక్షేమానికి వారి అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చెల్లు పెదరామన్న, కూసంపూడి బుజ్జి, వంట్ల పెదరామన్న, మద్దిపాటి సూర్య చంద్రం, జమ్ముల వీరవెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు

అధికార పార్టీని ఇబ్బంది పెట్టేందుకే 'బ్లూ మార్చ్'

ప్రజాశక్తి-రావులపాలెం

దళితుల్ని చైతన్య పరిచేందుకు నిర్వహించ తలపెట్టిన బ్లూ మార్చ్‌ని కొందరు స్వార్థపరులు అధికార పార్టీని ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేశారని వైసిపి నేతలు అన్నారు. వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు కప్పల శ్రీధర్, అడా ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ తదితరులు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్లూ మార్చ్ ని ఎల్లో మార్చ్ గా మార్చే ప్రయత్నం చేశారని గొల్లపల్లి డేవిడ్ ఆరోపించారు. శాంతియుతంగా జరపవలసిన కార్యక్రమాలలో అల్లరి సృష్టించి దళితులను విభజించాలని కుట్ర జరుగుతుందన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ ఏదైనా కార్యక్రమం చేపట్టాలంటే పార్టీలకు అతీతంగా అన్ని పార్టీ లతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని, అలా చేయనప్పటికీ వైసిపి నేతలు మద్దతు తెలిపారన్నారు. చివరకు ఇది టిడిపి కుట్రలో భాగంగా జరుగుతున్నట్లు గ్రహించడం జరిగిందని తెలిపారు.